

ఏకగ్రీవ పంచాయతీలకు...

గ్రామాభివృద్ధిని కాంక్షించి పంచాయతీలను ఏకగ్రీవం చేసిన గ్రామాలకు ఐదేళ్లు పూర్తయినా నజరానా దక్కలేదు.

- 8లో ▸



ఎస్సారెస్పీ వరద గేట్ల మూసివేత

ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లను అధికారులు శనివారం మూసివేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /17.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

మద్యం షాపులకు 34 దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్ : మద్యం షాపులకు శనివారం 34 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు నిజామాబాద్ స్టేషన్ పరిధిలోని మొత్తం 36 వైన్ షాపులకు 53, బోధన్ స్టేషన్ పరిధిలోని 18 వైన్ షాపులకు 23, ఆర్మూర్ స్టేషన్ పరిధిలోని 25 వైన్ షాపులకు 36, భీమ్‌గల్ పరిధిలో 12 వైన్ షాపులకు 22, మోర్తాడ్ పరిధిలో 11 వైన్ షాపులకు 15 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 102వైన్‌షాపులకు 149 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

యథావిధిగా ప్రజావాణి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ నిలిచిపోయినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పదవులకు దరఖాస్తులు షురూ



నిజామాబాద్ సిటీ : జిల్లా కాంగ్రెస్ పార్టీలో గడువు ముగిసిన పలు పదవులను త్వరలోనే భర్తీ చేయనున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితోపాటు నగర అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్ కార్యాలయంలో శనివారం పలువురు ఆశావహులు తమ దరఖాస్తులను సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మారచంద్రమోహన్, గంగాశంకర్, కునిపురి రాజారెడ్డి, పోల వెంకటేశ్ దరఖాస్తు చేసుకున్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మహ్మద్ ఖైసర్, బొబ్బిలి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు గన్‌రాజ్, శరత్‌కుమార్ దరఖాస్తు అందజేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

డిచ్‌పల్లి : ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రీషియన్, ఫొటోగ్రఫీ, సీసీటీవీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి ఎలక్ట్రీషియన్(31 రోజులు), ఫొటోగ్రఫీ (30రోజులు), 15 నుంచి సీసీటీవీ(13రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి, సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వచ్చి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ రోడ్డులో ఉన్న సంస్థ కార్యాలయంలో, 08461-295428 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

చిరుత సంచారం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కంచుమల్, సీతాయిపల్లి రోడ్డుపై చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత రెండు రోజులుగా రాత్రి వేళ కంచుమల్ నుంచి సీతాయిపల్లి వెళ్తున్న ప్రయాణికులకు రోడ్డుపై చిరుతపులి పరుగులు తీస్తూ కనిపించినట్లు పేర్కొన్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాత్రి వేళ, మధ్యాహ్నం రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బదిలీ బంధాలు

‘మక్క తోటలో కలుపు తీసేందుకు ముగ్గురు కూలీల అవసరం ఉందే.. మీరు నాకు బదిలీకి వస్తే నేను రేపు మీకు బదిలీకి వస్తా..’ అంటూ ఇద్దరు తోటి కోడళ్లను పిలిచింది సుంకరి శారద. సరే.. మా మక్క కూడా కలుపునకు వచ్చింది. ఇయ్యాల మీకు మేము పనికి వస్తాం... నువ్వు రేపు మాకు కలుపు తీయడానికి రా అని పిలుచుకున్నారు. మూడు రోజుల్లో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ముగ్గురు తోటి కోడళ్లు కలిసి బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామ పరిధిలోని మక్క తోటల్లో కలుపు తీయడం పూర్తి చేశారు.



ఆర్మూర్ ప్రాంతంలో పసుపు కొమ్ములు ఏరుతున్న బదిలీకి వచ్చిన బంధువులు (ఫైల్)

సమష్టిగా వ్యవసాయ పనులు

- కూలీల అవసరం లేకుండా పరస్పర సహకారం
- బలపడుతున్న మానవ సంబంధాలు
- ఆదర్శం.. ఆర్మూర్ ప్రాంత రైతాంగం
- వరి నాట్లు, కోతలు, పసుపు, మొక్కజొన్న పంటల్లో చేదోడు వాదోడుగా పనులు

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ.. మనుషుల మధ్య ఆత్మీయ పలకరింపులు కరువవుతున్నాయి. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆప్యాయంగా మాట్లాడాల్సిన బంధువులు, కష్ట సుఖాలను పంచుకునే తోబుట్టువుల మధ్య సైతం దూరం పెరుగుతోంది. ఇలాంటివి తమకేమీ పట్టవంటూ ఒకరికొకరు తోడుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆర్మూర్ ప్రాంత రైతులు. నిద్రలేచిన నుంచే ఆత్మీయ పలకరింపులు మొదలవుతాయి. వ్యవసాయంలో అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పరస్పర సహకారంతో కూలీల సమస్యను అధిగమించడంతో పాటు మానవ సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నారు. బదిలీలతో సమష్టిగా వ్యవసాయం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న గ్రామీణ రైతాంగంపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

సండే స్పెషల్

ఆర్మూర్ : రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం ఆర్మూర్ ప్రాంత రైతాంగం బదిలీ బంధాలను ఏర్పరుచుకొని ఆదర్శంగా నిలుస్తోంది. తమ మధ్య గల బంధాలు, బంధుత్వాలు, స్నేహాలతో ఒకరికి ఒకరు తోడుగా నిలుస్తూ వ్యవసాయంలో రాణిస్తున్నారు. కూలీల ధరలు పెరిగిపోవడంతో వరి నాట్లు, కోతలు, మొక్కజొన్న, సోయా, పసుపు లాంటి పంటలు విత్తుకొనే సమయంలో ఒకరికి ఒకరు బదిలీ కూలీగా వెళ్లి పనిని పంచుకుంటున్నారు. ఫలితంగా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు. ఒకవైపు కూలీల భారం లేకుండా వ్యవసా యం సాఫీగా సాగిపోతుండగా, మరోవైపు గ్రామాల్లో బంధాలు, బంధుత్వాలు, స్నేహాలు సైతం బలపడుతున్నాయి. గ్రామాల్లో మహిళలకు రోజు కూలీ రూ.500 ఉండగా పురుషులకు రూ. 1000 వరకు ఉంటుంది. గిట్టుబాటు ధరలు లభించని ప్రతికూల పరిస్థితుల్లో అంతంత పెట్టుబడి పెట్టే స్థోమత లేని వారు.. గ్రామంలో ఇతరులకు కూలీగా వెళ్లడం ఇష్టపడని వారు తమ బంధువుల తోటల్లోకి బదిలీపై వెళ్లి వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు. మరోవైపు బదిలీకి వెళ్లిన రోజు మధ్యాహ్నా సమయంలో బంధువులంతా కలిసి ముచ్చట్లు పెడుతూ సద్ది(భోజనం) తినడం.. ఒకరి వంటలు ఒకరు పంచుకోవడం వ్యవసాయ క్షేత్రాల్లో వనభోజనాలను తలపిస్తుంది. సమష్టి వ్యవసాయంతో ఈ ప్రాంత రైతుల తీరు ఆదర్శంగా నిలుస్తోంది.



ఆర్మూర్ ప్రాంతంలో వ్యవసాయ పనులు చేస్తున్న మహిళా రైతులు (ఫైల్)



సుంకరి శారద(మధ్యలో)కు బదిలీ వచ్చిన తోటి కోడళ్లు సుంకరి నిరోష(కుడి), సుంకరి నిరోష(ఎడమ)

ఆడుతూ పాడుతూ పని పూర్తవుతుంది..



కూలీకి వచ్చిన వారు కూలీ కోసం మాత్రమే పని చేస్తారు. కానీ బంధువులు, స్నేహితులకు బదిలీకి వెళ్లిన సమయంలో ఆడుతూ పాడుతూ పనులు పూర్తవుతాయి. ఎలాంటి భేషజాలకు తావియ్యకుండా కలిసి పని చేసుకోవడంతో పెట్టుబడి వ్యయం సైతం తగ్గిపోతుంది.

– గొల్ల లక్ష్మణ్, రైతు, వల్లభాపూర్, మాక్లూర్ మండలం

సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగకరం..



ఎకరం, రెండెకరాల వ్యవసాయం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు బదిలీ కూలీలు ఎంతగానో ఉపయోగపడతాయి. పెద్ద ఆసాములు ఈ మధ్య కాలంలో బిహార్, మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలకు గుత్తగా పనులు ఇచ్చేస్తున్నారు. మాలాంటి చిన్న రైతులు మాత్రం బదిలీలకు వెళ్తున్నాం.

– మీరప్పాల మల్లు, రైతు, వల్లభాపూర్, మాక్లూర్ మండలం

కూలీల కొరత ఉండదు..



చిన్న రైతులు పంటను పండించడం కోసం ట్రాక్టర్, హార్వెస్టర్లకే పెద్ద మొత్తం చెల్లిస్తున్నారు. ఇలాంటి సమయంలో కూలీల వ్యయం తగ్గించుకోవడానికి బదిలీలు ఉపయోగపడతాయి. గ్రామాల్లో బదిలీలు కొనసాగినన్ని రోజులు కూలీల కొరత ఉండదు.

– టీ సాయిలు, రైతు, మాక్లూర్ మండలం

డబ్బులు ఆదా అవుతాయి..



పెద్ద ఆసాములకు కూలీకి వెళ్లడంతోపాటు ఖాళీ రోజుల్లో మా పొలంలో బంధువులను బదిలీకి పిలుస్తాను. లేదా నేను వారికి బదిలీ వెళతాను. బదిలీల కారణంగా పెట్టుబడి తగ్గి పంట అమ్మిన సమయంలో నాలుగు డబ్బులు నా కూలీగా మిగులుతాయి. అది చాలా ఆనందాన్నిస్తుంది. పని చేసే సమయంలో ఒకరి కష్టసుఖాలను మరొకరం పంచుకుంటాం.

– భోజమ్మ, రైతు, మాక్లూర్ మండలం

రబీ బోనస్ కోసం రైతుల ధర్నా

- ఖరీఫ్ బోనస్‌పై స్పష్టతనివ్వాలని డిమాండ్
- తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

రుద్రూర్: రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన సన్నవడ్లకు బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కోటగిరి మండల కేంద్రంలో రైతులు శనివారం మహాధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రబీలో సన్నవడ్లు పండించిన రైతులకు వెంటనే బోనస్ ఇవ్వాలని, ప్రస్తుత సీజన్‌కు బోనస్ ఇస్తారా లేదా స్పష్టం చేయాలని నినాదాలు చేశారు. ఖరీఫ్ పంట కోతలు ప్రారంభమైనప్పటికీ రబీ సీజన్ బోనస్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత సీజన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్, ఎస్సై సాయన్న రైతుల వద్దకు చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు తెల్ల రవి, ఎముల నవీన్, వల్లెపల్లి శ్రీనివాస్, మోహన్ రావ్, శ్యామ్, శ్రీనివాస్, గజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కేంద్ర నిధుల జాప్యంతోనే..

- ఆర్‌వోబీ, అభివృద్ధి పనులకు ఆటంకం
- జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సీఎం సుముఖత
- 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు
- అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పక్కన మానాల, గడుగు, అరికెల

నిజామాబాద్ సిటీ : రాష్ట్రంలో ఆర్వోబీలు, పలు అభివృద్ధి పనులు కేంద్రం నుంచి నిధులు రాకపోవడం వల్లనే మందకొడిగా సాగుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతోందని, వ్యవసాయ కళాశాల, ఫామాయిల్ ఇండస్ట్రీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సముఖంగా ఉన్నారన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మహేశ్ కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి ముంబయి, వయా నిజామాబాద్ డబుల్ రైల్వేలైన్ విషయం ముఖ్యమంత్రితో చర్చించినట్లు మహేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ గర్జన సభ ఉంటుందన్నారు. అర్హులైనవారిని డీసీసీ అధ్యక్షులుగా ఎంపికచేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, బీసీ రిజర్వేషన్లు అమలుచేసి తీరతామని అన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టుకు వెళతామన్నారు. రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళతామన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేశారన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఫైల్, మరో రెండు బిల్లులు సైతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీజేపీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, కిషన్‌రెడ్డి వంటి వారు కేంద్రంలో రాష్ట్రానికి రావలసిన నిధులపై ప్రధానితో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బనక చర్ల విషయంలో మాజీమంత్రి హరీశ్‌రావు మైల కడుక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బనకచర్ల జీవోలు తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిచుక్కను కూడా వదిలే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర సహకార సంఘాల సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు మొబైల్ నిషేధం

- కామారెడ్డి డిపోలో అమలవుతున్న విధానం
- విధులకు ముందే ఫోన్ల డిపాజిట్
- ప్రమాదాల నివారణకు కృషి

నిజామాబాద్ రీజియన్‌లో డిపోలు- 6
పనిచేస్తున్న డ్రైవర్లు - 795



ఖలీల్‌వాడి: తెలంగాణ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునేందుకు వివిధ మార్గాలను అన్వేషిస్తూనే.. మరోవైపు ప్రయాణికుల మన్ననలను పొందేందుకు అన్నిరకాల అవకాశాలను ఉపయోగించుకుంటోంది. ఆర్టీసీ ప్రమాదాల నివారణకు ఇటీవల డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని తాజాగా బస్సు డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకం నిషేధించింది. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 రీజియన్ల నుంచి ఒక్కో డిపోను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ నుంచి కామారెడ్డి డిపోలో ఈ విధానం అమలు చేస్తోంది. ఈ మేరకు డిపోలోని డ్రైవర్లు సెల్‌ఫోన్ లేకుండా బస్సుల్లో విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవింగ్ సీటులోకి వెళ్లే ముందు డ్రైవర్లు అంతా తమ సెల్‌ఫోన్లను డిపో సెక్యూరిటీకి అందజేస్తున్నారు. గతంలో పలువురు డ్రైవర్లు విధుల్లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం సఫలీకృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో అమలు చేయనున్నట్లు సమాచారం.

సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా..

సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇంత కాలం జరిగిన ప్రమాదాలకు కారణాలను విశ్లేషిస్తూనే మరోసారి జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఈ విధానంలో ఏమైనా మార్పులు, సమస్యలుంటే తొలుత గుర్తిస్తాం. దశల వారీగా అన్ని డిపోల్లో అమలు చేస్తాం.

– జ్యోత్స్న, ఆర్ఎం

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవిందు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవిందు సూచించారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన, దల్హన్ ఆత్మనిర్భరత మిషన్ పథకాలను ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ ప్రారంభించగా, శనివారం మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా దేశంలోని అన్నదాతలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. అనంతరం డీఏవో గోవిందు మాట్లాడుతూ దేశంలో పప్పుదినుసుల సాగు విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పామాయిల్‌తోపాటు ఉద్యానవన పంటలు, మత్స్య సంపద పెంచడం, పశు సంపద, ఆహార ప్రాసెసింగ్ రంగాల తోడ్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, వ్యవసాయశాఖ ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, సొసైటీ సీఈవోలు, రైతులు పాల్గొన్నారు.





మోపాల్ రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో, ముప్ప గంగారెడ్డి తదితరులు

క్లుప్తంగా

డీసీసీ పదవికి మాజీ ఎంపీపీ దరఖాస్తు



బోధన్‌: బోధన్‌ మాజీ ఎంపీపీ, టీపీసీసీ డెలిగేట్‌ బి.గంగాశంకర్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్ష పదవికి శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు.ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు దాము, గణపతి రెడ్డి, సంజీవ్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ హామీలు అమలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: కాంగ్రెస్‌ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ హామీని అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. తప్పుడు నిర్ణయాలతో కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ నిర్లక్ష్య ధోరణితో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపరమైన లొసుగులను సరి చేసుకోవాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు పూర్తిగా మద్దతు తెలుపుతూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే బీసీ రిజర్వేషన్లతోపాటు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు.

మతిస్థిమితం లేని బాలుడి గుర్తింపు



నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని వర్ని చౌరస్తాలో తిరుగుతున్న మతిస్థిమితం లేని బాలుడిని గుర్తించినట్లు ఐదో టౌన్‌ ఎస్సై శనివారం తెలిపారు. వర్ని చౌరస్తాలో బాలుడు తిరుగుతున్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో బాబును పీఎస్‌కు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. బాబు వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఏకగ్రీవ పంచాయతీలకు మొండిచేయి

- పదవీ కాలం పూర్తయినా దక్కని నజరానా
- నిధుల విడుదలను పట్టించుకోని గత ప్రభుత్వం



మోపాల్‌ మండలంలోని తాడెం జీపీ కార్యాలయం

మోపాల్‌: గ్రామాభివృద్ధిని కాంక్షించి పంచాయతీలను ఏకగ్రీవం చేసిన గ్రామాలకు మొండిచేయే దక్కింది. ఎన్నికలు లేకుండా ఆదర్శంగా నిలిచిన జీపీలు పాలకుల వ్యవహారంతో అన్యాయానికి గురయ్యాయి. ఐదేళ్ల పదవీకాలం పూర్తయినా ఆదర్శ గ్రామపంచాయతీలకు నజరానా నేటికి అందలేదు. రూ.10 లక్షలను ప్రభుత్వం, మరో రూ.15లక్షలు ఎమ్మెల్యే, ఎంపీల నిధుల నుంచి కేటాయిస్తామని ప్రకటించారు. ఆ నిధులు విడుదలైతే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామనుకున్న వీరి ఆశలు అడియాశలయ్యాయి. 2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 530 (ప్రస్తుతం 542 జీపీలు) గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎన్నికల్లో 130 జీపీల్లో సర్పంచ్‌, వార్డుసభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు జరగకుండా సర్పంచ్‌ సహా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంటే తమ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15లక్షలు కేటాయిస్తామని ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర దాటినా.. మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నా.. ప్రోత్సాహకం కింద ఇస్తామన్న డబ్బులు రాకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలంటే ఆషామాషీ కాదు

పంచాయతీ ఎన్నికల వేళ ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. అప్పటి వరకు మిత్రులుగా ఉన్న వారు రాజకీయ శత్రువులుగా, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితిలో ఉన్న వారు దోస్త్‌ మేరా దోస్త్‌ అనేలా సమీకరణాలు మారిపోతుంటాయి. ఎమ్మెల్యే, ఎంపీ గెలవడం కన్నా.. సర్పంచ్‌ కావడం ఎంతో కష్టమని సీనియర్‌ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ ఓ సందర్భంలో ప్రస్తావించారు. ఇంతటి సందడి ఉండే ఎన్నికలను ఏకగ్రీవం పేరుతో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు తగిన ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. దివంగత మాజీ సీఎం వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఈ మొత్తాన్ని రూ.50వేల నుంచి రూ.5లక్షలకు పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి మరో రూ.15లక్షలు అదనంగా కేటాయిస్తామని తెలిపింది. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం నజరానాను పెంచుతుందో లేదో వేచి చూడాలి.

ప్రభుత్వాలపై సన్నగిల్లుతున్న విశ్వాసం..!

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయతీలకు ప్రభుత్వాలు ప్రోత్సాహకం ప్రకటిస్తున్నా.. నిధుల విడుదల్లో చిత్తశుద్ధి చూపడం లేదు. ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకమనేది చాలా ప్రభావితం చేస్తోంది. నిధులు విడుదల చేయకపోవడంతో ప్రభుత్వాలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని చెప్పక తప్పదు. కాగా ఇదేవిషయమై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ వివరణ కోరగా, ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం కోసం పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించినట్లు ఆయన తెలిపారు.

స.హ. చట్టానికి విలువేది?

- సమాచారం ఇవ్వడంలో అధికారుల కప్పదాటు వైఖరి
- నేడు సమాచార హక్కు చట్టం దినం



సిరికొండ: ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం, పారదర్శకత కోరుకునే ప్రజలకు గొప్పవరం సమాచార హక్కు చట్టం. అమలులో లోపాల వల్ల క్రమక్రమంగా నీరుగారి పోతోంది. సమాచారం ఇవ్వడంలో అధికారులు కప్పదాటు వైఖరి ప్రదర్శిస్తున్నారు. 12అక్టోబర్‌2005న సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 5 నుంచి ఆర్‌టీఐ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సమాచార హక్కు చట్టం సెక్షన్‌ 6 ప్రకారం పౌర సమాజం ద్వారా వచ్చిన సహ దరఖాస్తులను ప్రజా సమాచారం అధికారులు (పీఐవో) పట్టించుకోవడం లేదు. సెక్షన్‌ 7(1) ప్రకారం 30 రోజులలో ఇవ్వాల్సిన సమాచారాన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదు. సహచట్టం దరఖాస్తుదారులు సమాచారం కోరితే కొందరు అధికారులు సహయ నిరాకరణ చేస్తుండగా, మరికొందరు అరకొర సమాచారం ఇస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన 4(1)బి సెక్షన్‌కు చెందిన 17 అంశాల సమాచారం ప్రదర్శించడం లేదు. ఈ నెల 8న నిర్వహించిన సహచట్టం జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా శాఖ అధికారులకు, ప్రజా సమాచార అధికారులకు కలెక్టర్‌ దిశానిర్దేశం చేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలన్నారు. డివిజన్‌, మండల కేంద్రాల్లోని ప్రజా సమాచార అధికారులు దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దని కోరారు.

306 అప్పీళ్లు, 127 ఫిర్యాదులు పెండింగ్‌

సమాచార కమిషన్‌లో ప్రస్తుతం జిల్లా నుంచి 306 అప్పీళ్లు, 127 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాల వారీగా సమాచార కమిషన్‌ అప్పీళ్లు ఫిర్యాదులపై సమీక్ష జరుపుతోంది. అక్టోబర్‌ చివరి వారంలో సమాచార కమిషనర్లు జిల్లాకు రానున్నారు.

కమిషన్‌ సమీక్ష చేయాలి



సమాచార కమిషన్‌ చేసే సమీక్షలకు సాధారణ పౌరులను పిలవాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిషన్‌ సమీక్ష చేపట్టాలి. మా పరిధిలో కళాశాలల్లో విద్యార్థులకు ఆర్‌టీఐపై అవగాహన కల్పిస్తున్నాం. డివిజన్‌ మండల స్థాయిలో అధికారులు సహచట్టంపై తగిన ప్రచారం చేయడం లేదు. – పెద్ది మురళి, యూఎఫ్‌ఆర్టీఐ ప్రతినిధి

అవగాహన కల్పిస్తేనే..



సహచట్టం గురించి పౌరులకు అవగాహన కల్పించాలి. సరైన ప్రచారం లేకపోవడం వల్ల సహచట్టాన్ని ఎక్కువ మంది వినియోగించుకోలేక పోతున్నారు. సెక్షన్‌–26 ప్రకారం ప్రభుత్వం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి. – నరేశ్‌, యూఎఫ్‌ ఆర్టీఐ రాష్ట్ర కోకన్వీనర్‌

ప్రతిభచాటిన సైకాలజిస్టులు

- ముగ్గురికి ప్రపంచ రికార్డు పత్రాలు



ప్రపంచ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న తేజస్వి, శ్రీహరి



ప్రపంచ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న శ్రేయ

నిజామాబాద్‌నాగారం/సిరికొండ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో మనోజాగృతి సంస్థ ఆధ్వర్యంలో యూనిసెంట్‌ స్కూల్‌, లార్జెస్ట్‌ మాస్‌ సైకాలజికల్‌ ఫస్ట్‌ ఎయిడ్‌ సెషన్‌ ప్రపంచ రికార్డు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన విశ్వతేజాస్‌ ట్రైనింగ్‌ అండ్‌ కౌన్సెలింగ్‌ సర్వీసెస్‌ స్థాపకులు శ్రీహరి, సభ్యురాలు తేజస్వి, సిరికొండ మండలం తాళ్లరామడుగు గ్రామానికి చెందిన ఇజాప శ్రేయ, ఇజాప రమేశ్‌ పాల్గొని ప్రపంచ రికార్డు పత్రాన్ని యూనియన్‌ అధికారి షరీఫా హనీఫ్‌, మనోజాగృతి స్థాపకురాలు డా.గీతా చల్ల చేతుల మీదుగా అందుకున్నారు.

ఎస్సారెస్పీ వరద గేట్ల మూసివేత

- గోదావరిలోకి నిలిచిన నీటి విడుదల!
- ఇప్పటి వరకు ఇన్‌ఫ్లో 862 టీఎంసీలు.. అవుట్‌ ఫ్లో 700 టీఎంసీలు



మూసి ఉన్న వరద గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలోకి నీటి విడుదలను అధికారులు శనివారం నిలిపివేశారు. ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి 700టీఎంసీల నీటిని వదిలారు. అందులో వరద గేట్ల ద్వారా 680 టీఎంసీలు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 20 టీఎంసీలు విడుదల చేశారు. ఆగస్టు 27 నుంచి మధ్యలో మూడు రోజులు మినహాయించి నిరంతరం వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగింది. ప్రస్తుత సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి 862 టీఎంసీల నీరు వచ్చి చేరింది. కాగా, ఈ నెల 28 వరకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశం ఉంది.

కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల..

ప్రాజెక్ట్‌ నుంచి ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేలు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 5 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్‌ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90 (80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఇలా..

వరద గేట్ల ద్వారా	680 టీఎంసీలు
వరద కాలువ ద్వారా	50.54 టీఎంసీలు
కాకతీయ కాలువ ద్వారా	26 టీఎంసీలు
సరస్వతి కాలువ ద్వారా	3.12 టీఎంసీలు
లక్ష్మి కాలువ ద్వారా	0.54 టీఎంసీలు
ఎస్కేప్‌ గేట్ల ద్వారా	20 టీఎంసీలు
ఆవిరి రూపంలో	5.54 టీఎంసీలు
అలీసాగర్‌ లిఫ్టు ద్వారా	0.58 టీఎంసీలు
గుత్ప లిఫ్టు ద్వారా	0.29 టీఎంసీలు
మిషన్‌ భగీరథకు	2.57 టీఎంసీలు

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో టోర్నీ



జాతీయస్థాయికి ఎంపికైన బాలికల బృందం, క్రీడాకారుడికి బంగారు పతకం అందిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి అండర్‌–14 ఎస్‌జీఎఫ్‌ తైక్వాండో టోర్నీ శనివారం ముగిసింది. జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలు అందించారు. పోటీల్లో మనస్విని(నిజామాబాద్‌), జునేరియాకుల్‌సమ్‌(నల్గొండ), సమన్విత(రంగారెడ్డి), కతిజాఫాతిమా(నిజామాబాద్‌), మగేశ్‌ మెహరిన్‌(రంగారెడ్డి), హారిక(రంగారెడ్డి), సమీక్ష(రంగారెడ్డి), టి. వైష్ణవి(హైదరాబాద్‌),చొక్కం ఓంకార్‌(నిజామాబాద్‌), జె.శశిధర్‌(నిజామాబాద్‌) బంగారు పతకాలు సాధించారు. వీరు ఈ నెల 28 నుంచి నాగాలాండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నాగమణి పేర్కొన్నారు. ఈ పోటీలు ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ ఈశ్వర్‌, పరిశీలకుడు రాజశేఖర్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు అజ్మత్‌, ప్రధాన కార్యదర్శి మాస్టర్‌ వినోద్‌నాయక్‌, పీడీలు గోపిరెడ్డి, శ్రీధర్‌, సురేశ్‌ పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికయ్యా



నేను 8వ తరగతి చదువుతున్నాను. గతేడాది ఎస్‌జీఎఫ్‌ టోర్నీలో పాల్గొని రాష్ట్రస్థాయిలో రన్నర్‌గా నిలిచి రజత పతకం సాధించాను.ఈసారి ఎలాగైనా బంగారు పతకం సాధించాలనే కసితో కోచింగ్‌ తీసుకున్నాను. మొదటిసారి బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉంది.
– హారిక, రంగారెడ్డి

బంగారు పతకం సాధించా



నేను 8వ తరగతి చదువుతున్నాను. ఎస్‌జీఎఫ్‌ టోర్నీలో పాల్గొనడం ఇది మూడోసారి. మూడుసార్లు రాష్ట్రస్థాయిలో రాణించి సత్తా చాటాను. ఈ ఏడాది కూడా బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాను. జాతీయస్థాయిలోనూ రాణిస్తా.
– రంగినేని మానస, వరంగల్‌

రజత పతకం సాధించా..



నేను ఈ ఏడాది రాష్ట్రస్థాయి టోర్నీలో రజత పతకం సాధించాను. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాను. గతంలో చాలా పతకాలు సాధించాను. జాతీయస్థాయిలో పాల్గొనేందుకు కష్టపడుతున్నాను. వచ్చే ఏడాది కచ్చితంగా జాతీయస్థాయికి ఎంపికవుతా.
– లాస్యప్రియ, నిజామాబాద్‌

చాలా సంతోషంగా ఉంది



మొదటిసారి తైక్వాండో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్నాను. మొదటి సారే బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉంది. ప్రతినిత్యం సాధన చేయడం వల్లే జాతీయస్థాయికి ఎంపికయ్యాను. మరింతగా నిరంతరం సాధన చేసి పతకాలు సాధిస్తాను. ప్రస్తుతం 7వ తరగతి చదువుతున్నాను. – చొక్కం ఓంకార్‌, నిజామాబాద్‌

జాతీయస్థాయిలో రాణిస్తా



ఎస్‌జీఎఫ్‌ టోర్నమెంట్‌లో గతేడాది రాష్ట్రస్థాయికి ఎంపికై రాణించాను. ఈ ఏడాది కూడా ప్రతినిత్యం సాధన చేయడంతో గోల్డ్‌మెడల్స్‌ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాను. మరింతగా శ్రమించిజాతీయస్థాయిలో పతకం సాధిస్తాను. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాను.
– జె. శశిధర్‌, నిజామాబాద్‌




క్రైం కార్నర్‌

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని రాంనగర్‌ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆర్మూర్‌ పట్టణంలోని సంతోష్‌నగర్‌ కాలనీకి చెందిన ప్రేమ్‌ ఇద్దరు వ్యక్తులతో కలిసి రాంనగర్‌ కాలనీలోని రామకృష్ణ ఇంటికి చెట్టు కొమ్మలు కొట్టడానికి వచ్చారు. కాగా ప్రేమ్‌తో వచ్చిన ఇద్దరు అడ్డా కూలీల్లో ఒకతను చెట్టు కొమ్మలు కొడుతూ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా ఇంటి యజమాని క్షతగాత్రుడిని ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బాల్కొండ: మెండోరా మండల శివారులోని కాకతీయ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. మృతురాలి వయస్సు 55–60 ఏళ్ల వరకు ఉంటుందని, లేత ఆకుపచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్టు ధరించి ఉందన్నారు. ఎడమ చేతికి పచ్చబొట్టు ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8712659859, 8712659864 నంబర్ల సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

కుటుంబ తగాదాలతో యువకుడి ఆత్మహత్య



సందీప్‌(ఫైల్‌)

మోపాల్‌: కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుస్మిత శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మోపాల్‌ మండలంలోని సిర్‌పూర్‌ గ్రామానికి చెందిన గోదా సందీప్‌(29) ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపంతో క్షణికావేశానికి గురైన సందీప్‌ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో డిష్‌ వైర్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్‌: మండలంలోని మారంపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఊరి బయట రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకోగా వారి నుంచి రూ.5,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గోదావరిలో ఒకరి గల్లంతు

- బావమరిది మృతదేహం కోసం గాలిస్తుండగా బావ గల్లంతు



గంగాధర్‌(ఫైల్‌)

బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్‌ శివారులోని గోదావరి నదిలో ఆర్మూర్‌ మండలం చేపూర్‌కు చెందిన కనికరపు గంగన్న(45) శనివారం గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. చేపూర్‌కు చెందిన గంగన్న తన బావమరిది జొరిగె గంగాధర్‌ కొన్ని రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో ఆయన స్కూటీ చాకిర్యాల్‌ గోదావరి సమీపంలో కనిపించింది. దీంతో ఇక్కడే పడి ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావించిన గంగన్న శనివారం కొంత మంది బంధువులతో కలిసి వచ్చి గోదావరిలోకి గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గంగన్న నీటిలో మునిగి కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్‌: మండలంలోని భూలక్ష్మి క్యాంప్‌ గ్రామానికి చెందిన లోకిరెడ్డి సాంబరెడ్డి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి శనివారం తెలిపారు. గ్రామంలో హోటల్‌ వ్యాపారం చేసుకుంటు జీవిస్తున్న సాంబరెడ్డి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. చేసిన అప్పులు బాగా పెరిగిపోవడంతో మనోవేదనకు గురై ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెంజల్‌లో వివాహిత..

రెంజల్‌: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్‌ శనివారం తెలిపారు. గత నెల 16న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ట్రాఫిక్‌ ఏసీపీ సయ్యద్‌ మస్తాన్‌ అలీ

నవీపేట: మండల కేంద్రంలోని బాసర రహదారిపై ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్‌ ఏసీపీ సయ్యద్‌ మస్తాన్‌ అలీ హెచ్చరించారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బాసర క్షేత్రానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శనివారం పరిశీలించారు. కొన్ని ఆక్రమణలను తొలగించి, మరికొందరికి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం స్థానిక పీఎస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇరుకుగా ఉన్న బాసర రహదారికి ఇరువైపులా కొందరు వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, ఇష్టానుసారంగా పార్కింగ్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బాసరలోని సరస్వతిదేవి దర్శనానికి వెళ్లే భక్తులకు నవీపేటలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే వారాంతపు కూరగాయలు, మేకల సంత ఇదే ప్రాంతంలో జరగడంతో మరింత ట్రాఫిక్‌ సమస్య ఎదురవుతోందని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ సమస్య నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. నార్త్‌ రూరల్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

రెండు కేసుల్లో ఆరుగురి రిమాండ్‌

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణ పీఎస్‌ పరిధిలోని రెండు చోరీ కేసుల్లో ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. శనివారం రాత్రి పట్టణ పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తా సమీపంలోని ఓ ఇంటి తాళం పగుల గొట్టి చోరీకి పాల్పడిన బోధన్‌కు చెందిన రాజేందర్‌ సింగ్‌, సాజన్‌ సింగ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి చోరీ చేసిన సొత్తును రికవరీ చేశామన్నారు. అలాగే బెల్లాల్‌ కిరాణ దుకాణం తాళం పగుల గొట్టి రెండు గ్యాస్‌ సిలిండర్లు చోరీకి పాల్పడిన మోస్రాకు చెందిన రావుల నాగరాజు, బండి తరుణ్‌, హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్‌, వర్నికి చెందిన హన్మాండ్లును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల విచారణకు కృషి చేసిన ఎస్సైలు భాస్కరాచారి, హబీబ్‌ఖాన్‌, సిబ్బందిని ఏసీపీ శ్రీనివాస్‌ అభినందించారని సీఐ తెలిపారు.

బంగారం దొంగిలించిన వ్యక్తి..

ధర్పల్లి: బంధువులమని పరిచయం చేసుకొని వృద్ధురాలి నుంచి బంగారం దొంగిలించిన వ్యక్తిని శనివారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భిక్షపతి తెలిపారు. ధర్పల్లి పీఎస్‌లో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. ధర్పల్లికి చెందిన కురి లక్ష్మి అనే వృద్ధురాలు ఈనెల 1న ధర్పల్లి పాత బస్టాండ్‌ సమీపంలోని టీ షాప్‌ వద్ద కూర్చొని ఉండగా కామారెడ్డికి చెందిన గడీల భైరయ్య, కురి లక్ష్మి వద్దకు వెళ్లి బంధువులమని చెప్పి ఆమె వద్ద ఉన్న బంగారం చెవి కమ్మలు తీసుకొని పారిపోయారు. వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడు భైరయ్య పై కామారెడ్డి జిల్లాలో పలు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. కేసును త్వరగా చేధించిన ఎస్సై కళ్యాణి, కానిస్టేబుల్‌ ప్రసాద్‌, సంతోష్‌లను సీఐ అభినందించారు.